ఆడపడుచులకు అండగా సీఎం జగనన్న ప్రభుత్వం

గణపవరం: నాలుగేళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రభుత్వం ఆడపడుచులకు అండగా నిలిచిందని, వారి సంక్షేమమే ధ్యేయంగా ఎన్నో పథకాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణీ, బాలింత మహిళలకు పది రకాల పోషకాలతో కూడిన పౌష్టికాహారం అందించడమేకాక, నెలకు రెండు సార్లు వారి ఇళ్లవద్దకే కిట్లుతీసుకెళ్లి అందించే బృహత్తర కార్యక్రమాన్ని తమ ప్రభుత్వం ప్రారంభించిందని అన్నారు. ఈసందర్భంగా మహిళలకు పోషకాహార కిట్లు అందచేశారు. గణపవరం, నిడమర్రు మండలాల ఎంపీపీలు అర్ధవరం రాము, ధనుకొండ ఆదిలక్ష్మి, జెడ్పీటీసీలు కోడే కాశి, దేవారపు సోమలక్ష్మిబాబు, మండల కన్వీనర్‌లు దండు రాము, సంకు సత్యకుమార్, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.


మహిళలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

మాతా, శిశు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

భీమడోలు: మాతా, శిశు సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని భీమడోలు జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ అన్నారు. భీమడోలు బీసీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రం వద్ద శుక్రవారం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో భాగంగా 10 రకాల టేక్ హోమ్ రేషన్ కిట్లను గర్భిణులు, బాలింతలకు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ పాము సునీతామాన్‌సింగ్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతల్లో పౌష్టికాహార లోపం, రక్త హీనతను నివారించేందుకు ప్రభుత్వం అద్భుత పథకాన్ని అమలు చేస్తోందన్నారు. మహిళల్లో రోగనిరోధక వ్యవస్థ వృద్ధి, రక్తహీనత నివారణ, తక్కువ బరువు, పుట్టుకతో వచ్చే లోపాలు వంటి సమస్యలు లేకుండా చేయడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. పూళ్ల పంచాయతీ శివారు ఎంఎంపురంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని కిట్లను ఎంపీటీసీ గంటా శ్రీనివాసరావు చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ షాహనాజ్ బేగం, అంగన్‌వాడీ సిబ్బంది, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.


భీమడోలులో గర్భిణులు, బాలింతలకు టేక్ హోమ్ రేషన్ కిట్లను పంపిణీ చేస్తున్న సర్పంచ్ పాము సునీతామాన్‌సింగ్, జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ


శ్రీరామవరంలో బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ అందజేస్తున్న సర్పంచ్ కామిరెడ్డి నాని

వైఎస్సార్ సంపూర్ణ పోషణ గర్భిణులకు, బాలింతలకు వరం

దెందులూరు: వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని శ్రీరామవరంలో పార్టీ మండల అధ్యక్షుడు, గ్రామ సర్పంచ్ కామిరెడ్డి నాని ప్రారంభించారు. ఈ సందర్భంగా కామిరెడ్డి నాని మాట్లాడుతూ గతంలో బాలింతలకు, గర్భిణులకు ఆరోగ్యం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు. సంరక్షకులు కేంద్రాలకు వెళ్లి పది రకాల సంపూర్ణ పోషణ కిట్‌ను తెచ్చుకునే వెసులబాటు ముఖ్యమంత్రి దూరదృష్టితో ఏర్పాటు చేశారన్నారు. దెందులూరు సెక్టార్ సూపర్‌వైజర్ శ్రీదేవి మాట్లాడుతూ వైఎస్సార్ సంపూర్ణ పోషణ గతంలో ఎన్నడూ లేని విధంగా పది రకాల పోషక పదార్థాలు గర్భిణులు, బాలింతలకు రాష్ట్ర ప్రభుత్వం అందించడం ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త కొత్తపల్లి సరళ, మామిడి రాంబాబు, కామిరెడ్డి బాలు, కామిరెడ్డి ప్రతాప్, అక్కినేని శ్రీనివాసరావు, లబ్ధిదారులు ఉన్నారు.

ఉప్పాకపాడులో..

ఉంగుటూరు: మండలంలోని ఉప్పాకపాడు అంగన్‌వాడీ సెంటర్‌లో శుక్రవారం గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోమ్ రేషన్‌ను ఉప్పాకపాడు సర్పంచ్ నేదూరి వీర వెంకట మోహనరావు చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. స్థానిక ప్రధానోపాధ్యాయులు నక్క సుధాకర్, ఉపాధ్యాయులు అల్లు శ్రీను, ఏ.ఎన్.ఎమ్ ప్రశాంతి, ఆశావర్కర్లు మణి, నిర్మలా, గర్భిణీ, బాలింతలు పాల్గొన్నారు.

పింఛన్ అందజేత


భీమడోలులో రోగికి పింఛన్ నగదును అందిస్తున్న వలంటీర్ బోణం గంగ

భీమడోలు: భీమడోలులోని పక్షవాతంలో మంచం పట్టిన ఓ రోగికి శుక్రవారం మహిళా వలంటీర్ పింఛన్ నగదును అందించారు. గ్రామంలోని రోగి షేక్ పీర్‌బాషా అనే వృద్ధుడు పక్షవాతంతో కొంతకాలంగా మంచం పట్టాడు. వైఎస్సార్ పింఛన్ సొమ్ము ఆ కుటుంబాన్ని ఆసరాగా ఉంటోంది. దీనితో వలంటీర్ బోణం గంగ తన పరిధిలోని పీర్‌బాషా ఇంటికి వెళ్లి అతనికి పింఛన్ నగదు రూ.3వేలను అందించింది. మంచంపై ఉన్న అతని వేలిముద్రలు తీసుకుని అతనికి పింఛన్ నగదును అందించింది. ఇలాంటి రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్ నగదును అందిస్తున్న వలంటీర్ల సేవలను లబ్ధిదారులు అభినందించారు.

పరిసరాల పరిశుభ్రత పాటించండి

పెదపాడు: వాతావరణలో మార్పుల దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాల పరిశుభ్రతను పాటించాలని పెదపాడు వైస్ ఎంపీపీ రెడ్డి స్వర్ణకుమారి తెలిపారు. మండలంలోని పెదపాడు శివారు గండిచెరువు గట్టులో శుక్రవారం టెంపాస్ దోమల మందు పిచికారీ చేసారు. హెల్త్ అసిస్టెంట్ బత్తుల రమేష్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

తల్లి పాలు అమృత తుల్యం


తల్లిపాలు వారోత్సవాల ప్రాముఖ్యతను వివరిస్తున్న వైద్యాధికారి కె.శ్రీలక్ష్మీ

భీమడోలు : తల్లి పాలు అమృతతుల్యమని గుండుగొలను పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ కె.శ్రీలక్ష్మీ అన్నారు. భీమడోలు సచివాలయ-1 పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా నాల్గవ రోజైన శుక్రవారం గర్భిణులు, బాలింతలకు తల్లిపాలు విశిష్టతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యాధికారి కె.శ్రీలక్ష్మీ మాట్లాడుతూ పుట్టిన అరగంటలోనే తల్లి బిడ్డకు ముర్రుపాలు ఇవ్వాలని తద్వారా వ్యాధి నిరోధక శక్తి వృద్ధి చెందుతుందన్నారు. తొలుత గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో సీహెచ్ శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ ఎస్‌కే నవీన్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న సర్పంచ్ పాము సునీతామాన్‌సింగ్, జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ

భీమడోలు: సీజనల్ వ్యాధులపట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సర్పంచ్ పాము సునీతామాన్‌సింగ్, జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ అన్నారు. భీమడోలులో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఫ్రైడే డ్రైడేలో భాగంగా వైద్య ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది గ్రామంలో ర్యాలీ, ప్రదర్శన చేసారు. దోమల సమాజానికి ప్రథమ శత్రువులని, వాటిని నియంత్రించేందుకు ప్రతి ఇంటా ఫ్రైడే డ్రైడేను జరపాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజల భాగస్వామ్యం ఎంతైనా అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య శాఖ ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నేడు గడపగడపకు మన ప్రభుత్వం

నిడమర్రు: పెదనిండ్రకొలను గ్రామ సచివాలయం పరిధిలో శనివారం ఉదయం 8గంటల నుంచి గడపగడపకు మన ప్రభుత్వం (188వ రోజు) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు హాజరై ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి నేటి వరకూ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను లబ్ధిదారులకు వివరిస్తారన్నారు. గ్రామస్థాయి నుంచి మండలస్థాయి వరకూ అధికారులు హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు హాజరవ్వాలని సత్యకుమార్ కోరారు.

ఎంటీఎస్ ఉపాధ్యాయుల వినతి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : జిల్లాలో 1998 డీఎస్సీలో అర్హత సాధించి మినిమమ్ టైమ్ స్కేల్ ప్రాతిపదికన పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు జిల్లా విద్యాశాఖాధికారి పి.శ్యామ్ సుందర్‌కు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పగడాల సాంబశివరావు, వడ్లమూడి రామ్మోహన రావు, ఎంటీఎస్ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు తోట ఎడ్వర్డ్ మాట్లాడుతూ ఎంటీఎస్ ఉపాధ్యాయులకు వారి మండలాలకు దగ్గరగా పోస్టింగులు ఇవ్వాల్సి ఉన్నా కొందరికి 80 నుంచి 90 కిలోమీటర్ల దూరంలో పోస్టింగులు ఇవ్వడం వల్ల వారు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని డీఈఓ దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. సమీప మండలాల్లో పోస్టింగ్‌లు ఇవ్వాలని కోరామన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి డీఈఓ హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.

నిర్వాసితులకు కేంద్రం న్యాయం చేయాలి

ఏలూరు రూరల్: కేంద్ర ప్రభుత్వం పోలవరం నిర్వాసితులకు నిధులు వెంటనే మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం రవి ఓ ప్రకటనలో కోరారు. పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరుతూ ఆగష్టు 7న ఢిల్లీలో చేపట్టబోయే ధర్నా విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. పోలవరం జాతీయ ప్రాజెక్టుగా కేంద్రం గుర్తించినందున కేంద్ర ప్రభుత్వమే నిర్వాసితులకు నిధులు చెల్లించాలని కోరారు. నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పునరావాసం ఏర్పాటుచేయకపోవడం వల్లే నేటికీ ఏటా వచ్చే వరదలకు ప్రజలు ముంపుబారిన పడుతున్నారని ఆరోపించారు. ప్రాజెక్టు కోసం త్యాగాలు చేసిన నిర్వాసితులను ఆదుకోవడం ప్రభుత్వం కనీస ధర్మం అన్నారు. పోలవరం నిర్వాసితుల కోసం సీపీఎం పోరాటం చేస్తోందన్నారు. ఇందులో భాగంగా జూన్, జులై నెలల్లో పోరుకేక పేరుతో విజయవాడలో మహాపాదయాత్ర నిర్వహించామని గుర్తు చేశారు. బీజేపీ ప్రభుత్వం పోలవరం నిర్వాసితులు పరిహారం అందించే అంశంపై మాట్లాడటం లేదని ఆరోపించారు.

ప్రజా సమస్యలు గడప వద్దే పరిష్కరించేందుకు కృషి

- ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు
- చురుగ్గా పెదనిండ్రకొలనులో గడపగడపకు మన ప్రభుత్వం


పెదనిండ్రకొలనులో సంక్షేమ పథకాల లబ్ధి పత్రాన్ని లబ్ధిదారుల కుటుంబాలకు అందిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

నిడమర్రు: ప్రజల సమస్యలు తెలుసుకుని తగిన విధంగా పరిష్కరించేందుకే గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా ప్రతి ఇంటికి వస్తున్నట్లు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. శుక్రవారం సాయంత్రం పెదనిండ్రకొలను గ్రామ సచివాలయం పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం (187వ రోజు) నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ ప్రజల వద్దకే పరిపాలన అనే లక్ష్యంతో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులను అందుబాటులో ఉంచేందుకే గ్రామ సచివాలయ వ్యవస్థను ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. నేడు ఈ వ్యవస్థ ప్రజలకు చేరువై సత్ఫలితాలు వస్తున్నాయన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాలతో ప్రతి కుటుంబం ప్రభుత్వ పరంగా ఏదో విధంగా ఆర్థిక భరోసా పొందిందన్నారు. ఆ వివరాలు ప్రజలకు, లబ్ధిదారులకు తెలియ పరిచేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి అధికారిని, ప్రజా ప్రతినిధులను ప్రతి ఇంటికి పంపించి పథకాల అమలుతీరు, సమస్యలు తెలుసుకోమని మీ వద్దకు పంపించారని లబ్ధిదారులతో వాసుబాబు అన్నారు. వర్షాలు తగ్గిన వెంటనే రహదారుల నిర్మాణాలు, మరమ్మతులు వేగంగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. నియోజవర్గంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ప్రజల నుంచి ఆశించిన స్థాయికంటే ఎక్కువగానే మద్దతు రావడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కోడే కాశి, మండల కన్వీనర్ సంకు సత్యకుమార్, సర్పంచ్ ముగ్గళ్ల యాకోబు, వైస్ ఎంపీపీ బండిరమణవిస్సాకు, ఎంపీటీసీ చినిమిల్లి నరసింహమూర్తి, సొసైటీ అధ్యక్షులు దాట్ల శివవర్మ, గ్రామ పార్టీ అధ్యక్షులు కోడూరి రాంబాబు, పార్టీ నేతలు ఆవాల రాంబాబు, విప్పర్తి మధు, బెవర రాంబాబు, వేగేశ్న సుబ్బరాజు, అల్లాడి అబ్బులు, పుప్పాల కొండయ్య, చినిమిల్లి శ్రీను, నక్కా రామకృష్ణ, దాసరి సురేష్, కొంచాడ గోవిందరావు, చినిమిల్లి రాంబాబు, కోటి నరసింహరావు, కోటి గోవింద్, బద్దిరెడ్డి సుబ్రహ్మణ్యం, పోతురాజు భీమన్న తదితరులున్నారు.

మంత్రులతో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి భేటీ

దెందులూరు: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి శుక్రవారం అమరావతిలో డిప్యూటీ సీఎం అప్పలనాయుడు, జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబును కలిశారు. శాఖాపరమైన సమస్యలను వారితో చర్చించారు. శాఖాపరమైన అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. అనంతరం తాడేపల్లిలోని ఏపీఈడబ్ల్యూఐడీసీ కార్యాలయంలో నిర్వహించిన ఐడీసీ నూతన చైర్మన్ యనమల నాగార్జున యాదవ్ ప్రమాణస్వీకార కార్యక్రమంలో పాల్గొని చైర్మన్ నాగార్జునను సన్మానించారు. అనంతరం విజయవాడలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. శాఖాపరమైన సమస్యలు వివరించారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గంటా ప్రసాద్, దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన్న ప్రసాద్, పెదవేగి మండల వైఎస్సార్ సీపీ నాయకులు బొద్దు సతీష్ చౌదరి ఉన్నారు.


రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

జనాదరణ పొందిన 'జగనన్న సురక్ష'

గణపవరం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలో అతి తక్కువ సమయంలో అత్యంత ప్రజాదరణ పొందిన కార్యక్రమం జగనన్న సురక్ష కార్యక్రమమని, ఈకార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది సమస్యలు పరిష్కారమవుతాయని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతంగా పూర్తయిన సందర్భంగా పార్టీ ముఖ్యనేతలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం వ్యాప్తంగా కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించి, విజయవంతం చేసిన అధికారులు, పార్టీ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అర్హత ఉన్న వారెవరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరం కాకూడదన్న లక్ష్యంతో ప్రజలకు ఉపయోగపడేలా సురక్ష కార్యక్రమాన్ని అర్థవంతంగా నిర్వహించామన్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలో జూలై 1వ తేదీనుంచి 31వ తేదీ వరకూ నిర్విరామంగా నిర్వహించిన సురక్ష కార్యక్రమంలో 60వేల మందికి వివిధ రకాల సర్టిఫికెట్లు అందజేశామని వివరించారు. వలంటీర్లు ఇంటింటికీ తిరిగి సేకరించిన సమస్యలను అధికారులు జగనన్న సురక్ష కార్యక్రమంలో అక్కడికక్కడే పరిష్కరించి అవసరమైన సర్టిఫికెట్లు పౌరులకు అందజేశారన్నారు. గణపవరం, నిడమర్రు, ఉంగుటూరు ఎంపీపీలు అర్ధవరం రాము, ధనుకొండ ఆదిలక్ష్మి, గంటా శ్రీలక్ష్మి, జెడ్పీటీసీలు కోడే కాశి, కొరిపల్లి జయలక్ష్మి, దేవారపు సోమలక్ష్మిబాబులు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లు సంకుసత్యకుమార్, దండు రాము, చేబ్రోలు సొసైటీ అధ్యక్షుడు ఎలిశెట్టి పాపారావు, పార్టీ నాయకులు పుప్పాల గోపి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుబాబు, చిత్రంలో పార్టీ నాయకులు

విద్యార్థులంతా క్షేమం

- అస్వస్థతకు గురైన విద్యార్థులను జిల్లా కేంద్రానికి తరలింపు
- ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి పర్యవేక్షణ


విద్యార్థులకు ధైర్యంగా ఉండాలని ధైర్యం చెబుతున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి


శుక్రవారం రాత్రి జిల్లా కేంద్ర ఆసుపత్రికి విద్యార్థులను తరలిస్తున్న అబ్బయ్యచౌదరి

పెదవేగి : విద్యార్థులంతా క్షేమంగా ఉన్నారని ఎవ్వరూ అధైర్య పడాల్సిన అవసరం లేదని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. శుక్రవారం రాత్రి క్రికెట్ పోటీల ఎంపికకు పెదవేగి నవోదయ విద్యాలయానికి వచ్చిన వారిలో 42 మంది విద్యార్థులకు అస్వస్థత సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే ప్రభుత్వం యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. పెదవేగి నవోదయ విద్యాలయకు ఆయన చేరుకుని విద్యార్థులను పరిశీలించారు. అప్పటికప్పుడు 108 వాహనాలను ఏర్పాటు చేసి జిల్లా కేంద్ర ఆసుపత్రికి విద్యార్థులను తరలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ నవోదయ విద్యాలయంలో రీజినల్ క్రికెట్ మీట్ అండర్-14,17 ఈనెల 3 నుంచి 5 వరకు ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తున్నారని, ఈ ఎంపిక ప్రక్రియకు ఏపీ నుంచి 59, తెలంగాణ నుంచి 35, కర్ణాటక నుంచి 82, కేరళ 29, పాండిచ్చేరి నుంచి 3 మొత్తం 194 మంది విద్యార్థులు, ఎస్కార్ట్స్‌తో వచ్చారని అబ్బయ్యచౌదరి తెలిపారు. గురువారం రాత్రి విద్యార్థులు చికెన్‌తో భోజనం చేశారని, శుక్రవారం ఉదయం శాఖాహారం తిన్నారని చెప్పారు. ఒక్కసారిగా కొంత మంది విద్యార్థులకు జ్వరం, అలసటతో నిరసంగా ఉన్నారని, సమాచారం తెలియగానే కలెక్టర్‌తో మాట్లాడి నవోదయ విద్యాలయాన్ని సందర్శించి పూర్తిస్థాయిలో వైద్య సదుపాయాలు ఏర్పాటు చేశామని ఆయన చెప్పారు. ఎవ్వరికీ ఏ విధమైన ఇబ్బంది లేదని ఆయన చెప్పారు. డీఎంహెచ్‌ఓ ఆధ్వర్యంలో వైద్యులను ఏర్పాటుచేసి, 108 వాహనాల ద్వారా మెరుగైన వైద్యం అందించే దిశగా జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలిస్తున్నామని, ప్రతి ఒక్క విద్యార్థి సంతోషంగా తిరిగి వారి ప్రాంతాలకు వెళ్లేలా పూర్తి బాధ్యత వహిస్తామని ఎమ్మెల్యే చెప్పారు. జిల్లా వైద్య అధికారి నాగేశ్వరరావు, డీఎస్పీ అశోక్‌కుమార్ గౌడ్, విద్యాలయ ప్రిన్సిపాల్ వై చంద్రశేఖర్, సీఐ దుర్గాప్రసాద్, ఎస్సై ఎం లక్ష్మణ్ ఇతర వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిర్వాహకుడి అరెస్ట్ : విటులపై కేసు

ఏలూరు టౌన్ : ఏలూరు రూరల్ పరిధి హనుమాన్ నగర్ సమీపంలోని కొత్తూరు వంతెన వద్ద ఓ ఇంట్లో గుట్టుగా సాగుతోన్న వ్యభిచారం గుట్టురట్టు అయ్యింది. ఆన్‌లైన్‌లో యువతులను బుక్ చేసుకునేలా గత కొంత కాలంగా వ్యభిచారం సాగుతున్నట్టు తెలుస్తోంది. ఏలూరు వన్‌టౌన్ సీఐ ఎన్.రాజశేఖర్, ఏలూరు రూరల్ ఎస్సై ఎన్.లక్ష్మణబాబు తమ సిబ్బందితో వ్యభిచారం సాగిస్తోన్న ఇంటిపై శుక్రవారం దాడి చేశారు. నిర్వాహకుడితో పాటు మరో నలుగురు విటులను పోలీసులు అరెస్టు చేశారు. విజయవాడ, గన్నవరం తదితర ప్రాంతాల నుంచి యువతులను ఏలూరు నగరానికి రప్పించి శివారు ప్రాంతంలో ఇంటిని అద్దెకు తీసుకుని, వ్యభిచారం నిర్వహిస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. బాధిత యువతులకు కౌన్సిలింగ్ ఇచ్చి సంరక్షణ కేంద్రాలకు పంపారు. వ్యభిచార కేంద్రం నిర్వాహకుడు బాలచందర్, మరో నలుగుర్ని పోలీసులు అరెస్టు చేశారు. ఏలూరు వన్‌టౌన్ సీఐ రాజశేఖర్ మాట్లాడుతూ నగరంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహించేదిలేదని హెచ్చరించారు. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని చెప్పారు.

భారీ వాహనాల రాకపోకలకు చెక్

ఉంగుటూరు: భారీ వాహనాల రాకపోకలకు ఉంగుటూరులో చెక్ పెట్టారు. టోల్ గేటు ఎగవేసి గ్రామంలోకి చొరబడే భారీ వాహనాలకు ఇక అడ్డుకట్ట పడనుంది. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఐరన్ గడ్డర్‌ను టన్నెల్ సమీపంలో నిర్మించారు. ఫలితంగా వాహనాలు వచ్చే అవకాశం లేదు. ఉంగుటూరులో జాతీయ రహదారిపై ఉన్న టోల్‌గేటు వద్ద టోల్ చెల్లించకుండా నాచుగుంట వంతెన మీద నుంచి ఉంగుటూరు వంతెన వరకు కాలువగట్టుపై వాహనదారులు ప్రయాణం చేసి వెళుతున్నారు. ఫలితంగా ఉంగుటూరు -కాగుపాడు రహదారి పూర్తిగా దెబ్బతింది. రణగొణ ధ్వనులు, దుమ్ముతో గ్రామంలో ప్రజలకు ప్రశాంతత కరువైంది. ఈ విషయంపై గ్రామస్తులు అనేక మందికి ఫిర్యాదులు చేశారు. ఈ సమస్యను గ్రామంలో గడపగడపక ఎమ్మెల్యే వాసుబాబు తిరిగినప్పుడు ప్రజలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. భారీ వాహనాలు గ్రామంలోకి రాకుండా పంచాయతీ నిర్ణయం తీసుకుని గడ్డర్లు వేసుకోవచ్చునని ఎమ్మెల్యే వాసుబాబు సూచించారు. ఈమేరకు సర్పంచి బందారు సింధు పాలకవర్గం నిర్ణయం తీసుకుని కాలువగట్టుపై ఐరన్ గడ్డర్ నిర్మించారు. దాంతో భారీ లోడు లారీలకు నిరోధం ఏర్పడింది. దాంతో ప్రజలు పంచాయతీ సర్పంచి పాలకవర్గాన్ని అభినందిస్తున్నారు.


ఉంగుటూరు టన్నెల్ ప్రాంతంలో అడ్డుగా నిర్మించిన ఇనుప గడ్డర్

జల్లి కాకినాడ వాసికి ఏపీఎన్‌ఆర్‌టీఎస్ సాయం


రాజేష్‌కు ఔట్ పాస్‌పోర్టు అందిస్తున్న రీజనల్ కో ఆర్డినేటర్ నరసారెడ్డి

కడప కార్పొరేషన్: ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ (ఏపీఎన్‌ఆర్‌టీఎస్) సభ్యుల సాయంతో ఏలూరు జిల్లా గణపవరం మండలం జల్లికాకినాడ వాసి అనిపి రాజేష్ ఎలాంటి సమస్యలు లేకుండా ఇండియాకు వచ్చాడు. వివరాలిలా ఉన్నాయి. రాజేష్ నాలుగేళ్ల క్రితం జీవనోపాధి కోసం డ్రైవర్ పని నిమిత్తం కువైట్ వెళ్లాడు. అక్కడ కువైటీ (స్పాన్సర్) డ్రైవర్ పని ఇవ్వకుండా ఏడారి ప్రాంతంలో కూలి పని చేయించుకుంటూ వచ్చాడు. రెండేళ్ల క్రితం కువైటీ కారును అతనికి తెలియకుండా రాజేష్ నడిపి యాక్సిడెంట్ చేసి గాయాలపాలయ్యాడు. అనంతరం రాజేష్‌ను ఇంట్లో బాయ్‌గా నియమించుకొని ఎక్కువ పని చేయిస్తూ స్పాన్సర్ వేధించాడు. దీంతో రాజేష్ అతడి నుంచి పారిపోయాడు. పాస్‌పోర్టు కువైటీ వద్దనే ఉంచుకోవడం వల్ల ఆకామా (రెసిడెన్సి) కూడా లేకుండా పోయింది. ఈ క్రమంలో రాజేష్ ఏపీఎన్‌ఆర్‌టీఎస్‌ను ఆశ్రయించాడు. ఆ సంస్థ రీజనల్ కో ఆర్డినేటర్ ఎంవీ నరసారెడ్డిని కలిసి తన కష్టాలు తెలియజేశాడు. ఆయన వెంటనే స్పందించి సామాజిక కార్యకర్త రెడ్డెయ్యరెడ్డితో కలిసి భారత రాయబార అధికారులతో మాట్లాడి ఔట్ పాస్‌పోర్టు తయారు చేయించి ఈనెల 2న సురక్షితంగా వారి స్వస్థలానికి పంపించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ ఏపీఎన్‌ఆర్‌టీఎస్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రవాసాంధ్రుల సమస్యలు పరిష్కరించేందుకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, భారత రాయబార అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

స్థల వివాదంలో వ్యక్తి మృతి


వెంకటేశ్వరరావు భౌతికకాయం వద్ద రోదిస్తున్న బంధువులు

పెదవేగి: లక్ష్మీపురం పంచాయతీ దిబ్బగూడెం గ్రామంలో ఇళ్ల స్థలాలను కొలుస్తుంగా జరిగిన వివాదంలో ఓ వ్యక్తి గుండెపోటుతో మృతిచెందాడు. ఎస్సై ఎం.లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం.. దిబ్బగూడేనికి చెందిన యర్రా ఇమ్మాంజీరావును అతడి భార్య చిన్నారి 30 ఏళ్ల క్రితం విడిచి పిల్లలను తీసుకుని వెళ్లిపోయింది. అనంతర కాలంలో ఇమ్మాంజీరావు గ్రామంలో తనకున్న 30 సెంట్ల ఇంటి స్థలాన్ని గ్రామంలోని ఎనిమిది మందికి విక్రయించాడు. అతడు దాదాపు 20ఏళ్ల క్రితం మృతిచెందాడు. ఈ నేపథ్యంలో అతడి భార్య చిన్నారి శుక్రవారం ప్రైవేట్ సర్వేయర్‌ను తీసుకుని గ్రామానికి వచ్చి తన భర్త అమ్మిన ఇంటి స్థలాలను కొలతలు వేయిస్తుండగా కొనుగోలు చేసిన వారు గొడవకు దిగారు. బొడ్డు వెంకటేశ్వరరావు (50) అనే వ్యక్తి ఆమెతో గొడవ పడుతూ గుండెపోటుతో కుప్పకూలిపోయాడు. అతడిని హుటాహుటిన ఏలూరు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. విషయం తెలిసిన మృతుని బంధువులు చిన్నారి, ప్రైవేట్ సర్వేయర్‌పై దాడికి దిగారు. సీఐ ఎస్.దుర్గాప్రసాద్, ఎస్సై ఎం.లక్ష్మణ్ సంఘటనా స్థలానికి చేరుకుని గాయాలపాలైన చిన్నారి, ప్రైవేట్ సర్వేయర్‌ను పెదవేగి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు. రాత్రి వరకు పోలీస్ బలగాలతో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకున్నారు.